స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక

రాజేంద్రనగర్: ఈ నెల 13వ జరగనున్న పోలింగ్‌లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. శనివారం రాజేంద్రనగర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల డీసీపీ శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 2877 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రతి కేంద్రంలో ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా వసతులు కల్పించామన్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. పోటీలో 43 మంది అభ్యర్థులు ఉన్నారని, వారి కోసం మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్లు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. పోలింగ్ సామగ్రితో ఆదివారం ఈ బృందాలు త మకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని తె లిపారు. డిస్ట్రిబ్యూషన్ సంబంధించి శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ స్టేడియం, మహేశ్వరానికి సంబంధించి గుర్రంగూడలోని స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీ, రాజేంద్రనగర్‌కు సంబంధించి రాజేంద్రనగర్ తహసీల్ కార్యాలయం, బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల, వికారాబాద్‌కు సంబంధించి వికారాబాద్‌లోని మారీ ఎ.నోట్స్ స్కూల్, తాండూర్‌కు సంబంధించి తాండూర్‌లోని సెయింట్ మార్క్స్ ఇంటర్నేష నల్ హై స్కూల్, పరిగికి సంబంధించి పరిగిలోని మినీ స్టేడి యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

పోలింగ్ కేంద్రాల పటిష్ట భద్రత: డీసీపీ శ్రీనివాస్

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని చేవెళ్ల డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఇప్పటివరకు రూ.10 కోట్ల 70 లక్షల 16 వేల 937 నగదు, రూ. 1,76,12,006 లక్షల విలువైన మద్యం, రూ.5,05,03,026 విలువ చేసే 1846.8203 కిలోల గంజాయి, రూ. 31,14, 44,388 విలువ చేసే బంగారం, 30,34,700 విలువ చేసే సిల్వర్ ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



అత్తాపూర్ డివిజన్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

అత్తాపూర్: ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల తేజస్వీనినగర్, ఎమ్ఎంగూడ ప్రాంతాల్లో సీఆర్పీఎఫ్, టీఎస్ఎస్పీ, అత్తాపూర్ పోలీసులు శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన కోకాపేట విద్యార్థులు

మణికొండ: మలేషియా దేశంలో జరిగిన అంతర్జాతీయ 20వ గోజు–ర్యూ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2024 పోటీల్లో నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలోని షోటాకాన్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. పోటీల్లో 8 మంది విద్యార్థులు పాల్గొనగా ముగ్గురు బంగారు, ఇద్దరు సిల్వర్, ముగ్గురు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు గ్రాండ్ మాస్టర్ అనిల్ కుమార్, మాస్టర్ రాజు తెలిపారు. శనివారం జరిగిన ఫైనల్ పోటీల్లో పతకాలు సాధించారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులను వారు అభినందించారు.

కిస్మత్‌పూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం



కిష్మత్‌పూర్‌లో ప్రచారం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి నాయకులతో కలిసి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లో శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేస్తూ కారు గురు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల నుంచి బీఆర్ఎస్‌కు మంచి ఆదరణ వస్తుందని, చేవెళ్ల గడ్డపై మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధాంతి బస్తీలో..



సిద్ధాంతిబస్తీలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

శంషాబాద్: పట్టణంలోని సిద్ధాంతిబస్తీలోని ఒకటో వార్డులో బీఆర్ఎస్ నేతలు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నాయకుడు మంచర్ల శ్రీనివాస్ ఓటర్లను కోరారు. ప్రచారంలో నేతలు చిన్నగండు రాజేందర్, రామల్ల రమేశ్, చిన్నగండు భాస్కర్, పోతుగంటి జంగయ్య, కద్దాల్ పీటర్, సుధాకర్, దేవులు తదితరులు ఉన్నారు.



నార్సింగిలో బైక్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



మణికొండలో మహిళా నాయకురాళ్లతో సీతారంజిత్‌రెడ్డి

ముగిసిన ప్రచార పర్వం

- మూగబోయిన మైక్‌లు
- చివరిరోజు జోరుగా ప్రచారం
- పాల్గొన్న అన్ని పార్టీల శ్రేణులు

మణికొండ: సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం శనివారం ముగిసింది. గత నెల 25వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం ప్రచారం మొదలు పెట్టిన అన్ని పార్టీల శ్రేణులు చివరిరోజు వరకు హోరాహోరీగా నిర్వహించారు. శనివారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నార్సింగి కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు క్యాతం అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు గొలిదొడ్డి నుంచి వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట, కోకాపేట, మంచిరేవుల, నార్సింగి వరకు వందలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ టి.కృష్ణ ఆధ్వర్యంలో ఖానాపూర్ గ్రామంలో పాదయాత్ర చేపట్టారు. నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంచిరేవుల, నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నార్సింగిలో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. నార్సింగి మాజీ సర్పంచ్ కె. ప్రసన్న అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నార్సింగిలో, మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్. కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నెక్నాంపూర్, నార్సింగి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సీహెచ్. భిక్షపతియాదవ్, కోకాపేట కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డి ఆధ్వర్యంలో కోకాపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి సీతారంజిత్‌రెడ్డి మణికొండలో మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, నాయకులు



కోకాపేటలో బీజేపీ అధ్యక్షుడు భిక్షపతి, కౌన్సిలర్ ఆదిత్యరెడ్డి



నార్సింగిలో ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్



నెక్నాంపూర్‌లో బస్తీలో మణికొండ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్

'పక్షపాత వైఖరి కారణంగానే పార్టీని వీడాం'



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

శంషాబాద్: అభివృద్ధి నిధుల కేటాయింపులో అన్యాయం, స్థానిక బీఆర్ఎస్ నేతల పక్షపాత ధోరణి కారణంగానే తాము బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు కౌన్సిలర్లు మునగాల అమృత, బండి భాగ్యలక్ష్మి, మస్రత్‌జా, స్రవంతి, భద్రునాయక్, శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు. శంషాబాద్‌లో శనివారం వారు మాట్లాడుతూ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో గెలిచిన 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరినపుడు ఎంత ప్యాకేజీ తీసుకున్నారని ప్రశ్నించారు.? అభివృద్ధి అంతా కేవలం మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్‌పర్సన్‌తో పాటు ఫార్వర్డ్‌బ్లాక్ నుంచి వచ్చిన కొందరు కౌన్సిలర్ల వార్డులకే పరిమితమైందని మండిపడ్డారు. శంషాబాద్ అభివృద్ధికి హెచ్ఎండీఏ, టీఎస్‌యూఐడీఎఫ్ నుంచి రూ. 100 కోట్ల మంజూరులో ఎమ్మెల్యేతో ఎంపీ రంజిత్‌రెడ్డి కృషి చేశారని, అదేవిధంగా డిగ్రీ కళాశాల మంజూరులోనూ ఎంపీ పాత్రం ఉందన్నారు. తమ వార్డుల అభివృద్ధితో పాటు భవిష్యత్ రాజకీయం కోసం కాంగ్రెస్‌లో చేరామని తెలిపారు. రంజిత్‌రెడ్డి గెలుపునకు పాటుపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, తాజ్‌బాబా తదితరులున్నారు.

వృద్ధురాలి పుస్తెలతాడు చోరీ

శంషాబాద్ రూరల్: నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడుతో పాటు సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లిన ఘటన సుల్తాన్‌పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాటకారి లక్ష్మి (60) శుక్రవారం రాత్రి భోజనం చేసి మేడపై నిద్రించింది. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మేడపైకి వచ్చి.. ఆమె మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. గమనించిన లక్ష్మి దుండగుడిని పట్టుకునేందుకు యత్నించినా.. తప్పించుకున్నాడు. అంతేగాకుండా ఇంట్లోని సెల్‌ఫోన్‌ను కూడా దోచుకెళ్లినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

అన్ని వర్గాలకు అండగా కాంగ్రెస్



బండ్లగూడలో బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



ప్రచారం చేస్తున్న మంగళారం గోవర్ధన్ రెడ్డి, తదితరులు

బండ్లగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందని పాడి పరిశ్రమ అభివృద్ధి చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొన్నింటి అమలులో జాప్యం జరిగిందని ఎన్నికల తర్వాత అవి కూడా అందుతాయన్నారు. చేతిగుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, ప్రేమ్‌గౌడ్, డప్పు నవీన్‌కుమార్, వెంకట్‌రెడ్డి, టింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్ డివిజన్‌లో..

అత్తాపూర్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళారం గోవర్ధన్ రెడ్డి గఅత్తాపూర్ డివిజన్‌లో శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజిత్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడని, చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధి, సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి పలుగుచెరువు మహేశ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఎం సోదరుడు కొండల్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కోరని బాల్‌రాజ్, వశ్రీ లలిత్, డేవిడ్, డివిజన్ గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్, ప్రవీణ్ యాదవ్, సాయి ముదిరాజ్, భారత్ రెడ్డి, శ్యామ్, ఉమామహేశ్వరి, పెండ్యాల శ్రీధర్, మహేందర్, విశాల్, మహేశ్, సురేశ్, సుభాష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ..

మైలార్‌దేవ్‌పల్లి: గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్ రెడ్డి శనివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్ నుంచి కార్యకర్తలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎన్ ధనంజయ్, జీవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



మైలార్‌దేవ్‌పల్లిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఇంద్రపాల్‌రెడ్డి

'చేవెళ్లలో విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయం'



విక్టరీ సింబల్ చూపుతున్న సంగీతారెడ్డి

మణికొండ: చేవెళ్లలో విశ్వేశ్వర్‌రెడ్డి విజయం ఖాయమని ఆయన సతీమణి అపోలో ఆసుపత్రి డైరెక్టర్ కొండా సంగీతారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో మన దేశం అనేక రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న దేశభక్తులైన బీజేపీ నాయకులు, కార్యకర్తల బలంతో ఎన్నికల్లో విజయం సాధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు శ్రీకాంత్‌స్వామి, కోఆప్షన్ సభ్యురాలు జె.లక్ష్మీరాములు, మణికొండ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు ఇందిరా, వేణుకుమార్, నర్సయ్యచారి, ఆనంద్‌రావు, అనితాదేవి తదితరులు పాల్గొన్నారు.

గగన్‌ఫహాడ్ బస్తీలో బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు..



ప్రచారం చేస్తున్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

రాజేంద్రనగర్: చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతుగా బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్‌ఫహాడ్ బస్తీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే ఎస్సీ వర్గీకరణ చేపడుతామని పీఎం మోదీ హామీనిచ్చారని, మనమందరం కలిసి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు క్యసరం శంకర్ రావు మాదిగ, సర్కిల్ ఇన్‌చార్జి గడ్డం సామెల్ మాదిగ, శివ మాదిగ, జోగు రవి, చేవెళ్ల బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, బీజేపీ సీనియర్ నాయకుడు తలారి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు చకచకా ఏర్పాట్లు



నార్సింగి ప్రభుత్వోన్నత పాఠశాలలో చేస్తున్న ఏర్పాట్లు

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా కేంద్రాల వద్ద ఇప్పటికే టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేయగా, పోలింగ్ బూత్‌ల నెంబర్లను కేటాయించే పనులు చేస్తున్నారు. ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా తాగునీరు, నీడలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం పోలింగ్ అధికారులు, సిబ్బంది ఈవీఎం యంత్రాలతో వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకోనున్నారు. రాత్రికి వారు బస చేసేందుకు, భోజనాలు, సోమవారం ఉదయం టిఫిన్లు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. దివ్యాంగుల కోసం ట్రై సైకిళ్లను సైతం అందుబాటులో పెట్టారు.

రోడ్డు తవ్వకంపై ఫిర్యాదు

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు ముఖ ద్వారం వద్ద ఉన్న ప్రధాన రహదారి పక్కనే గల రోడ్డును ఓ రిటైర్డ్ అధికారి తవ్వించాడని పక్కనే ఉన్న భూ యజమాని ఫసీయుద్దీన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు నిర్మాణం సమయంలో రోడ్డులో సంబంధిత వ్యక్తి భూమిని సేకరించినప్పటికీ ఆయన ప్రస్తుతం ఉన్న రహదారి కూడా తనదేనని వాదిస్తున్నారన్నారు. దీనిపై రెవెన్యూ, పోలీసులు స్పందించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. రహదారిని అడ్డంగా తవ్వడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు.

హెచ్‌సీయూ డిపోకు రెండో స్థానం

రాములోరి తలంబ్రాల బుకింగ్‌లో గుర్తింపు



హెచ్‌సీయూ డిపో మార్కెటింగ్ విభాగం బృందాన్ని సత్కరిస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు

రాయదుర్గం: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో సీతారాముల కల్యాణం సందర్భంగా తలంబ్రాల ప్యాకెట్లను బుకింగ్ చేయడంలో ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపోకు రెండోస్థానం లభించింది. దీంతో హెచ్‌సీయూ డిపో మార్కెటింగ్ విభాగం అధికారుల బృందాన్ని ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించి బహుమతిని అందించారు. ఆర్టీసీ జెడ్ఎస్టీసీ డైరెక్టర్ అపర్ణాకళ్యాణి, జీహెచ్‌జెడ్ సీటీఎం మధుసూదన్, ఇతర ఉన్నతాధికారులు కలిసి హెచ్‌సీయూ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విజేందర్‌రెడ్డి, బృందాన్ని సత్కరించి బహుమతిని అందజేశారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ప్రజల నుంచి తలంబ్రాల ప్యాకెట్ల కోసం బుకింగ్ చేసుకోవాలని కోరగా 1100 మంది బుకింగ్ చేసుకోగా.. తలంబ్రాల ప్యాకెట్లను ఇప్పటకే చాలా మందికి ఇంటింటికి తీసుకెళ్లి అందించారు. మిగిలిన వాటిని మరోవారం రోజుల్లో అందించేందుకు ఏర్పాట్లు చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో రెండోస్థానం పొందడంపై హెచ్‌సీయూ డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి మార్కెటింగ్ విభాగాన్ని అభినందించారు. వచ్చే ఏడాది మొదటి స్థానం పొందాలని సూచించారు.